# చీకటిలో చిరుదీపం!

రచన: శ్రీ ఎస్. బి. రాజ్



**ఆ** రోజు అమావాశ్య! చుట్టూ చీకటి వ్యాపించి వుంది.

ఆ చీకటిలో ఒక గుడిశ ముందు చిన్న సమురు దీపం మిణుకు మిణుకు మంటూ వెలుగుతున్నది. దీపం పక్కనే శిధిలావస్థలోనున్న నులకమంచం, దానిపై అనుభవాలు పండబారి ముడుతలుపడ్డ దేహంతో మమత అస్తవ్యస్థంగా పడుకొని వుంది.

మమత అంటే మమతే! తన జీవితంలో అనురాగాలకు నిలయమైనదే మమత! ఆ అనురాగాలను ఇతరులకు పంచేదే మమత! కానీ ఆమె బ్రతుకులో మమతకే తావులేదు. ఆమెకు యీ వృద్ధాప్యంలో నేను వున్నాను నీ కోసం అనే మనుషులే కరువైనారు. బీటలువారిన మనసుపై పన్నీటి జల్లు కురిపించే మమతానురాగాలు కావాలి. ఆమె కళ్ళ ముందు తన కుమారుల రూపాలు కదలాడసాగాయి.

లాయర్ భగత్ పెద్ద కుమారుడు. అతడు చట్టానికి ప్రతినిధి! న్యాయానికి రక్షకుడు! ధర్మవ్యవస్థాపకుడు. సమాజంలోని అన్యాయాలను తుదముట్టించి జాతిని జాగృతం చేయవలసినవాడు. కానీ, కన్నతల్లి విషయంలో న్యాయవిచక్షణను మరచాడు. అతనికి తల్లి ఒక భారం!

రెండవ కుమారుడు డాక్టర్ చంద్రశేఖర్. గవర్నమెంటు డాక్టర్! పేదలపాటి పెన్నిది కావలసినవాడు. ప్రాణాలను రక్షించే దేవుడు లాంటివాడు డాక్టర్! అతనికి కన్నతల్లి ప్రాణాలు కాపాడాలనే విషయమే గుర్తుండదు. ఆమె మరణిస్తే వచ్చే డబ్బుమీదే వుంది అతని మనసు!

మూడవ కొడుకు రాజు. వ్యవసాయదారుడు! బీడు భూములను సాగులోనికి తెచ్చి ఆహారధాన్యాలను ఉత్పత్తి చేసే రైతు! దేశానికి వెన్నెముక లాంటివాడు. జన్మనిచ్చిన తల్లి అతని దృష్టిలో బీడుపడిన భూమిలాంటిది. ఆమెను గురించి అసలు పట్టించుకోడు. బీడు భూమిని సాగులోకి తేగలడు కానీ రక్తాన్ని పంచి ఇచ్చిన తల్లిని బాగా చూడాలని కనీసం ఆమెకు పాడుబడిన భూమి కిచ్చిన విలువన్నా ఇవ్వాలన్న జ్ఞానములేని దానవుడు.

భగత్, చంద్రశేఖర్, రాజు, మూడు పేర్లు మమతకు యెంతగానో ఇష్టమైన పేర్లు! భారతావని సంకెళ్ళను తెంపడానికి పాతికేళ్ళకే బలి అయిన అమరవీరులు వాళ్ళు! తన కుమారులు అంతటివారు కావాలని ఆ కన్నతల్లి మనసు కోరుకుంది. అందుకే వాళ్ళకు ఆ పేర్లు పెట్టింది. కానీ ఆమెకు చివరకు మమతనే అందివ్వలేదు వాళ్ళు! మమత మనసు గతంలోకి పరుగులు తీసింది.

* * *

మమతా! పెళ్ళి అయ్యాక నువ్వు బాగా సన్నబడ్డావే! అసలు అన్నం తింటున్నావా అని నా సందేహం.

తినేది పచ్చడి మెతుకులైనా ఆప్యాయంగా పెడితే చాలే కరుణా! అది దూరమైనప్పుడే నాలా బాధపడాలి!

మమతా! ఏమిటే నువ్వు మాట్లాడేది నిన్ను మీ ఆయన బాగా చూడరా చెప్పవే!

కరుణా! జీవితం అందరికీ వడ్డించిన విస్తరి లాంటిది

ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు
ఆధారపడునవి.

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

లోధ్ర

గర్భపోషణకు సుఖ ప్రసవమునకు

గర్భరక్షక

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

హాదీఫల రసాయనం

ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి

సౌభాగ్యశొంఠి

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్,
మద్రాసు–600 014.

ఏజెంట్లు :

సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ–సికింద్రాబాద్.

కాదే! చిన్నతనంనుంచి కష్టాల్లోనే పెరిగాను. బాగా చదువు కోవాలనే కాంక్షవున్నా ఆ స్తోమతలేక నా చదువు ఆగిపోయింది. బ్రతుకులో నా మనిషి అని చెప్పకొనే వాళ్ళు వుండాలని పెళ్ళిచేసుకున్నాను. కానీ కరుణా! అక్కడ కూడా ఈ మమతకు కొంచెం మమతను పంచియిచ్చే వాళ్ళే కరువైనారే!

అంటే మీ వారు కూడా నిన్ను...నిన్ను...

ఆయనలో యే మూలో దాగివున్న మానవత్వం ఆ దానవుల మధ్య నశించిపోయింది. పక్కవారితో మాట్లాడినా సందేహం, అనుమానం! దేనికయినా నవ్వితే ఆడదానికి నవ్వు పనికిరాదు. పొరపాటున బరితెగించిన ఆడదాన్ని ఈ ఇంటి కోడలిగా చేసుకున్నాము అంటారు. నవ్వకుండా వుంటే దరిద్రపుముండ శనిలా దాపురించింది. దాని ముఖం ఎప్పుడూ ముడుచుకొనే వుంటుంది అంటారు.

మమతా! ఇంత జరిగినా నా కెందుకు తెలియచేయలేదే! నేను బ్రతికి వున్నానన్న సంగతి మర్చిపోయావా! యీ ఎనిమిదేళ్ళలో కరుణే గుర్తుకురాలేదా మమతా!

పిచ్చిదానా! వాళ్ళు పెట్టే బాధలు భరించలేక, నాకు ఓదార్పునిచ్చే మనిషిలేక యెంతగా కుమిలిపొయ్యే దాన్నో తెలుసా! ఈ సమయంలో నా కరుణవుంటే ఎంత బాగుండు అనిపించేది. కానీ పరదాల వెనుక బ్రతుకు నాది. పిల్లలు అమ్మా! మిఠాయి కొనుక్కుంటాను అంటే ఇవ్వడానికి పదిపైసలు కూడా నా దగ్గర వుండేది కాదు. నేను ఆ ఇంట్లో జీతంలేని పనిమనిషిని! గొడ్డు చాకిరిచేసే బానిసను. ఆ యింట్లో నా కున్న విలువ అంతే మరి!

మమతా! యిన్ని బాధలు ఒంటరిగా ఎలా భరించగలిగినావే! స్వతంత్ర భావాలు కలిగిన నీవు యిన్ని రోజులు కాపురం చేసావు అంటే నమ్మశక్యం కావడంలేదు. నేను ఒకే బిడ్డను కంటాను, వాడ్ని లోకోత్తరుడుగా తయారు చేస్తాను అని ఆనాడు నా మమత పలికిన పలుకులకు ఈ నాటి నీ బ్రతుకుకు యెంతగా బేధం వుందో తెలుసా!

అదే చూపు...అదే నవ్వు...అదే నడక! కానీ ఆ చూపులో జీవంలేదు! ఆ నవ్వులో అపశృతులు. ఆ నడక అనుభవాలు నేర్చిన పెద్దమనిషిలా వుంది.

నువ్వు అక్కడకు వెళ్ళకు మమతా! నువ్వు ఆ నరకకూపంలో బ్రతకలేవు. ఈ ముగ్గుర్నీ కూలిచేసైన పెంచుకోవచ్చు.

కరుణా! సహనానికీ, ఓర్పుకూ పరిమితి అంటూ వుంటుంది. నేను మరలా అక్కడకు వెళ్ళను. నా బిడ్డలను నేను పెంచుకోగలను. అంతే కానీ ఆ యింటికి వెళ్ళను. ఏదో నౌకరీ చెయ్యను. టీ కొట్టు పెట్టుకొని బ్రతుకుతాను. ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం లేనిదే పెళ్ళి చేసుకోకూడదు అన్నది అందుకేనేమో కరుణా! వస్తాలే మరలా కలుసుకుందాం.

*          *          *

కరుణా! నా మీద కోపం వచ్చిందా!

లేదు మమతా! నువు యేం చేసావని కోపం వస్తుంది.

అదికాదే నాకెంతో సహాయం చేసావు. నేను స్థిరపడే వరకు నాకు అండగా వున్నావు. ఈ చేతులతో బొగ్గులు అమ్మినాను, పిడకలు చేసి అమ్మాను, ముగ్గురినీ పెద్దవాళ్ళను చేసాను. సంఘంలో వాళ్ళకి ఒక గౌరవమైన స్థానాన్ని కల్పించాను. ఇవన్నీ నీ సహాయ సహకారాలతోనే జరిగాయి కరుణా! కానీ చివరకు నువ్వు కోరినదాన్ని తీర్చలేకపోయాను.

ఎందుకే అంతగా బాధపడతావు. మన స్నేహబంధాన్ని బంధుత్వంగా మార్చుకుందామనుకున్నాము. వాళ్ళు అంగీకరించలేదు. అంతేగా! వాళ్ళకి లక్షల కట్నం కావాలి. అంత స్తోమత నాకు లేదుగా! ఇక మర్చిపో మమతా ఆ విషయం. ఇలాంటి చిన్న చిన్న విషయాలకే మనసును కష్టపెట్టుకొని కోపగించుకుంటే అది స్నేహబంధమెలా అవుతుందే. అలా అయితే నేను నిజమైన స్నేహితురాలినా! టేక్ ఇట్ ఈజీ ఆమె భుజాలు తడుతూ అన్నది కరుణ.

కరుణా! పిల్లలను కనగలం కానీ వారి వ్రాతలను మార్చలేము. పిల్లలను ఆ నరకకూపం నుండి తీసుకొచ్చానని తృప్తి పడ్డానే కానీ, రక్తం సంబంధం యెక్కడకు పోతుంది. వాళ్ళకు వుండే రాక్షస బుద్ధులన్నీ వీళ్ళకు సంక్రమించాయి. మనుషుల రూపాలు వేరైన, వాతావరణం వేరైన వచ్చే బుద్ధులు ఆవేనని తెలిసింది.

నేను మంచాన పడితే వీళ్లు నన్ను చూస్తారా! నా దగ్గర ఒక జత బంగారు గాజులు, ఐదువేలు డబ్బు తప్ప యేమీ లేవు. వాళ్ళను గురించి ఆలోచించినానే కానీ నా బ్రతుకులో చివరకు యేమీ మిగుల్చుకోలేకపోయాను.

మమతా! యెవరేమన్నా నీకు నేనున్నానే. కరుణ బ్రతికి వున్నంత కాలం నీ బ్రతుకులో కొరత రానివ్వదే. గంజి నీళ్ళయినా పంచుకు త్రాగుదాం.

NOVEL DIAMONDS
NOVE DIAMOND WORKS

నోవెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములూ
మా వద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటీ ఇవ్వబడును.

——: వివరములకు :——

Phone No. 27468

**Novel Diamond Works**

7-A/2, Ncrth Sowrastra St. : : TIRUCHIRAPALLI-620 008.

కన్నీరు నిండిన మమత కళ్ళకు కరుణామూర్తియైన కరుణ రూపం మసకగా కనిపిస్తున్నది.

*   *   *

వాకిలిలో గణగణ మనే మ్రోత విని తన గతంనుండి తేరుకొని కనులు తెరిచింది మమత.

రిక్షా త్రొక్కుకుంటూ వచ్చి ఆమె గుడిసె పక్కన ఆగాడు అతడు.

'అమ్మా! నేనమ్మా నీ సూరీడును:

సూరీ...సూరీ అంటే మరలా మమత ఆలోచనలు గతంలో జరిగిన సంఘటనల పైకి మరలాయి.

*   *   *

కరుణా! అటు చూడవే! ఆ బాబు చిన్ని చేతులతో కంకర రాళ్ళను యెలా పగులగొడుతున్నాడో. వాడి పక్కన లెక్కం పుస్తకం. వాడికి చదువుపట్ల యెంత శ్రద్ధవుందో చూడు. దేశంలో ఇలాంటి వారు చాలామంది వున్నారు. ఎంత మందినని చదివించగలం. ప్రతిదానికి అలా ద్రవించి పోకూడదు. కొంచెం రాటుతే రాలాలి మనం.

నా ముగ్గురి పిల్లల మధ్య వాడు బరువు అవుతాడా కరుణా! వాడికి చదువు చెప్పిస్తాను. కొంచెం ప్రోత్సాహం ఇస్తే చాలే ఇలాంటి వాళ్ళకి. గొప్పవాళ్ళు అవుతారు. వాడి కళ్ళలో దీక్ష, పట్టుదల కనిపించాయి మమతకు. అందుకే సూరీకి చదువు చెప్పించింది. తెలివిగల సూరీ స్కాలర్ షిప్‌లమీద చదివి గొప్పవాడైనాడు.

*   *   *

కన్నీళ్ళ మధ్యనుంచి సూరీని చూసింది మమత!

బాబూ నువ్వా!

అవునమ్మా మీ సూరీడుని. డిగ్రీ పూర్తి చేసాను. రాబోయే ఉద్యోగం కోసం యెదురు చూసే బదులు కాలం వృధా చెయ్యకుండా రిక్షా త్రొక్కుతున్నాను. మిమ్మల్ని ఈ స్థితిలో చూస్తానని అనుకోలేదమ్మా. ముగ్గురు కొడుకులు

మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు !

ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుగుచున్నది

గోపాల్ పళ్ళపొడి




ఒక పేకెట్ వెల 0–70 పైసలు.

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితం ఎవరిని ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏ మాత్రమూ బాధ్యులు కాదు. —సంపాదకుడు.

వుండి కూడా మీరు...

సూరీ! నేను నా వాళ్ళకు బరువై పోయానురా!

మీ దయవ వలనే నేను ఈ స్థితిలో వున్నాను. మీరు యిచ్చిన ప్రోత్సాహమే నాకు చదువు రావడానికి కారణ మయింది.


బాబూ సూరీ! చెట్టుకు కాయలు భారం కావు. కన్న తల్లికి బిడ్డలు భారంకాదు నాయనా!

అమ్మా! నన్ను మీ బిడ్డలా ఆదరించారు. నేను మీ బిడ్డను కాకపోయినా కన్నతల్లి కన్నా మిన్నగా చూసు కుంటాను. నాతో రామ్మా! నేను తక్కువ కులం వాడ్నే కావచ్చు. కానీ అమ్మ మమతానురాగాలు ఈ పేదవాడి గుండెలో కూడా వున్నాయమ్మా.

ఆ మాట అన్నావు చాలురా సూరీ! నేను పండుటాకుని రేపో మాపో రాలిపోతాను. నాదేముంది. నీ చుట్టూ చదువుకోవాలని ఆసక్తి వున్నా చదివించేవాళ్ళు లేక అలమ టించే నీలాంటి సూరీడులు చాలామంది వున్నారు. నీకు చేతనయిన సహాయం వారికి చెయ్యి. నీ వల్ల మరో వంద మంది చదువుకోగలిగితే అదే నువ్వు నాకిచ్చే ప్రేమకానుక. కన్నతల్లి బిడ్డనుంచి ఇంతకంటే యేమీ కోరుకోదు. వెళ్ళు నాయనా!

అమ్మా! వంద మందిలో నువ్వు ఒక దానివి అను కుంటాను. నువ్వు నాకు భారం కాదమ్మా! కాళ్లలో శక్తి వుంది రిక్షా లాగడానికి. నా అమ్మకి పొట్టనిండా తిండి పెట్టకుండా వదలి వెళ్ళదమ్మా ఈ సూరీడు. నీ డబ్బు యేమీ నాకు వద్దు. నాతో వచ్చెయ్యవా అమ్మా!

చీకటిలో చిరుదీపంలా వచ్చావు సూరీ! నీకు మేలు జరుగుతుంది. కన్నీళ్లు కారిపోతుండగా మమత సూరీడు తలను ప్రేమగా నిమురుతూ అన్నది.




కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితం : 1938

| | | |
|---|---|---|
| విడి ప్రతి | ... | 80 పైసలు |
| సంవత్సర చందా | ... | 18-00 రూ. |

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)
నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్‌స్టాల్సులో దొరుకును.

కథాంజలి

నెం. 10, మురుగేశ మొదలి వీధి,
మదరాసు-600 079.